www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 19 మార్చి 2024



నరసాపురంలో రూ.5,467 కోట్లతో అభివృద్ధి

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నియోజకవర్గంలో అభివృద్ధికి, సంక్షేమానికి రూ.5,467 కోట్లు ఖర్చు చేశామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. స్థానికంగా సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తను గుర్తింపు ఇచ్చామన్నారు. నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చామన్నారు. ఈ నెల 18వ తేదీ నరసాపురం మండలంలోని గొంది గ్రామం నుంచి ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బర్రి వెంకటరమణ, వైసిపి, మురళి, కామన బుజ్జి పాల్గొన్నారు.

అభ్యర్థుల ప్రదక్షిణలు..!

పెద్దలు, నేతల ప్రసన్నమే లక్ష్యంగా పర్యటనలు
సమస్యలపై కానరాని కేంద్రీకరణ



ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. కోడ్ అమల్లో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. అభ్యర్థుల ఎంపిక పూర్తి చేసిన అధికార వైసిపి ఇప్పటికే వివిధ రూపాల్లో ప్రచారాన్ని ప్రారంభించింది. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు సైతం ఏదో రూపంలో ఓటర్లను కలిసే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ప్రతిపక్ష టిడిపి తాను పోటీ చేసే స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించడంతో వారు కూడా ప్రచారానికి తెర లేపారు. అదే సమయంలో ఆ కూటమిలోని జనసేన పోటీ చేసే స్థానాలపై స్పష్టత వచ్చినా, అభ్యర్థులు దాదాపు ఖరారైన అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. బిజెపికి కేటాయించిన స్థానాలపై స్పష్టత వచ్చినట్లు చెబుతున్న కైకలూరు అసెంబ్లీ, నరసాపురం ఎంపీ స్థానాల్లో అభ్యర్థులు ఖరారు కావాల్సి ఉంది. అయితే ఎన్నికల షెడ్యూల్లో పోలింగ్ ఏప్రిల్ 3, 4 నాలుగు వారాల్లో జరుగుతుందని అన్ని పార్టీల నేతలు భావించారు. అయితే అనూహ్యంగా మే రెండో వారానికి పోలింగ్ తేదీ వెళ్లిపోవడంతో ఇప్పటికే పార్టీల నేతలు, అభ్యర్థుల్లో గుబులు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ ప్రచార తీరును మార్చినట్లు రెండు రోజులుగా జిల్లాలో పరిస్థితులు చెప్తుపట్టి చెబుతున్నాయి. నేరుగా ఓటర్లను కలిసే సమయం తగ్గించుకుని ప్రధానంగా ఓటర్లను ప్రభావితం చేసే ఆయా గ్రామాలు, ప్రాంతాల్లోని పెద్దల చుట్టూ అభ్యర్థులు ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో పాటు ఆయా నేతలను ప్రసన్నం చేసుకోవడానికి ఆయా ప్రాంత ఓటర్లను తమ వైపు తిప్పుకోవడానికి ఇవ్వాల్సిన హామీలు, చేయాల్సిన పనుల గురించి చర్చిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇప్పటి నుంచే ఎన్నికల ప్రచారం అంటే సుమారు నెల 20 రోజుల పాటు ప్రచార ఖర్చులు, ఇతర ఖర్చులు భరించడం కష్టమనే అభిప్రాయంతో ఎక్కువ మంది అభ్యర్థులు ఈ మార్గాన్ని ఎన్నుకున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు ఏప్రిల్ రెండో వారం తర్వాత నేరుగా ఓటర్లను కలిస్తే సరిపోతుందని, లేనిపక్షంలో రెండు, మూడు సార్లు తిరగాలంటే ఖర్చు తడిసి మోపెడవుతుందని అభ్యర్థుల అనుచరులు వ్యాఖ్యానిస్తున్నారు. అదే సమయంలో ఇప్పటికే ప్రచారం ప్రారంభించినవారు రోజు ఒక గంట లేదా రెండు గంటలు ఓటర్లను కలుస్తూ పెద్దలను కలిసే పనే ప్రధానంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే రెండు జిల్లాల్లో కొన్ని నియోజకవర్గాల్లో అధికార, ప్రతిపక్ష అభ్యర్థులు మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు తాయిలాలు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఎన్నికల గడువు ఎక్కువ సమయం ఉండడంతో ఎటువంటి ఇబ్బంది లేకుండా నామినేషన్ల పర్వం ముగిసి ప్రచారం తారాస్థాయికి చేరేవరకు మరోసారి తాయిలాలు ఏం పంపిణీ చేయాలన్న దానిపై నేతలు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉండగా అభ్యర్థులు, నేతలు పెద్దలను తమ వైపు తిప్పుకోవడం, ఓటర్లను ప్రలోభానికి గురి చేయడంపై పెడుతున్న దృష్టి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ఏం చేస్తారో, కార్యాచరణ ఏంటో అనే అంశాలపై దృష్టి పెట్టకపోవడం విస్మయం కలిగిస్తోంది. నేతలు, పెద్దలు చెప్పిన సమస్యలు తప్ప ప్రజాసమస్యలు ఎజెండాలోకి వచ్చే అవకాశాలు ప్రస్తుత పరిస్థితుల్లో కానరావడం లేదు. ఓటర్లు ప్రధానంగా యువత తమ ప్రాంత మౌలిక సమస్యల పరిష్కారంపై ఆయా అభ్యర్థులను ప్రశ్నించి స్పష్టమైన వైఖరి ప్రకటించాలని కోరడం తప్ప మరో గత్యంతరం కనిపించడం లేదని మేధావులు అభిప్రాయపడుతున్నారు. నామినేషన్ల పర్వం ముగిశాక సాగే ప్రచారంలోనైనా అభ్యర్థులు, ఆయా పార్టీల నేతలు ప్రజా సమస్యలపై దృష్టి పెడతారో, లేక ప్రలోభాలపైనే ఆధార పడతారో వేచి చూడాలి.

'పది' పరీక్షలకు 21,523 మంది హాజరు

1,597 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులు నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేయడంతో విద్యార్థులు గంట ముందే కేంద్రానికి చేరుకున్నారు. అరగంట ముందే పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించారు. 22 స్ట్రాంగ్ పాయింట్స్ భద్రపర్చిన పరీక్ష పత్రాలను పరీక్ష నిర్వహణ ముందు ఆయా పరీక్షా కేంద్రాలకు పటిష్ట భద్రతతో తరలించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 127 పరీక్షా కేంద్రాల్లో 27,426 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. తెలుగు పరీక్షకు 23,120 మంది హాజరు కావాల్సి ఉండగా 21,523 మంది విద్యార్థులు హాజరయ్యారు. సుమారు 1,597 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 42 ఫ్లయింగ్ స్క్వాడ్లు 8 పరీక్షా కేంద్రాలను, జిల్లా విద్యా శాఖ అధికారి ఆర్.వెంకటరమణ, పరీక్షల సహాయ కమిషనర్ సత్యనారాయణ 54 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. 1,390 మంది ఇన్విజిలేటర్లు పరీక్షలను పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణ సిబ్బందంతా గుర్తింపు కార్డులు ధరించి విధులకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో సెల్ ఫోన్లు గాని ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు గాని అనుమతించకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరిగాయి.

నిబద్ధతతో పని చేయాలి

కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ఎన్నికల కంట్రోల్ రూమ్‌లో పనిచేస్తున్న వారంతా నిబద్ధతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను సందర్శించి అన్ని విభాగాలకూ చెందిన అధికారులు, సిబ్బందితో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఎలాంటి కాల్స్ వస్తున్నదీ, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఆరా తీశారు. ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసి ల్యాండ్ లైన్ నంబర్ల వద్ద నిత్యం కాల్స్‌కు హాజరు కావాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌లో ఉన్న 08816-299616, 08816-299617 నంబర్లకు మోడల్ కోడ్ ఉల్లంఘనపై అందిన ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ట్రెయినీ డిప్యూటీ కలెక్టరు, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ కానాల సంగీత్ మాథుర్, సంబంధిత జిల్లా అధికారులు, ఎలక్షన్ సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, డిప్యూటీ తహశీల్దార్లు, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



ఆర్‌డిఒ, రిటర్నింగ్ ఆఫీసర్ చెన్నయ్య

ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేసేందుకు తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్‌డిఒ, రిటర్నింగ్ ఆఫీసర్ కె.చెన్నయ్య తెలిపారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను అమలు చేసేందుకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన సమస్యలను తెలియజేసేందుకు తాడేపల్లిగూడెం కంట్రోల్ రూమ్ నంబర్ 08818 229699కు ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. పట్టణంలో నియోజకవర్గంలో ఇప్పటికే రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు బ్యానర్లు తొలగించామన్నారు. విగ్రహాలకు ముసుగులు కప్పామన్నారు. రాజకీయ పార్టీ నాయకుల పేర్లు ఉన్న శిలాఫలకాలను పేపర్‌తో మూసివేశామన్నారు. నిష్పక్షపాతంగా వివక్ష లేకుండా ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేశామన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగులకోసం హోమ్ ఓటింగ్‌ను ఏర్పాటు చేశామని, సుమారు 200 నుంచి 220 మంది వృద్ధులను గుర్తించామని తెలిపారు. ఎన్నికల విధుల్లో వాలంటీర్లు పాల్గొనే అవకాశం లేదన్నారు. నియోజవర్గ పరిధిలో 63 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ బి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

ముంపు బారిన పడకుండా చర్యలు చేపట్టాలి

వేండ్రలోని వరిచేలను పరిశీలించిన ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు



నీటి ప్రభావాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ రామరాజు

గోస్తని - వేల్పూరు కాలువకు ఆనుకుని ఉన్న వరిచేలు ముంపు బారిన పడకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు కోరారు. వీరవాసరం బ్రాంచి కాలువలో నీటి ప్రవాహం అధికమై వేండ్ర పరిధిలోని పంట కాలువలకు సోమవారం నీరు పోటెత్తింది. పలుచోట్ల గట్టుపై నుంచి నీరు పొంగి పంట పొలాల్లోకి ప్రవేశిస్తుంది. ఇదే పరిస్థితి కొనసాగితే ముంపు బారిన పడి పొట్ట దశలో ఉన్న వరి పంట దెబ్బతినే ప్రమాదం ఉందని గ్రహించిన స్థానిక రైతులు సమస్యను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎంఎల్‌ఎ రామరాజు వేండ్రలోని పంట పొలాలను పరిశీలించారు. అక్కడి నుంచే ఇరిగేషన్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పంటలు దెబ్బ తినకుండ నీటి ప్రవాహ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు బిసి ఉండి నియోజకవర్గ నేత కామన రాంబాబు, మాజీ ఎంపిపి పాల చలపతి, కమ్మిల రాంబాబు ఉన్నారు.



గణపవరంలో...



పాలకొల్లులో..



పెనుగొండలో...

'పది' పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం

పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని ఎంఇఒ పి.పుష్పరాజ్యం తెలిపారు. సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు మండలంలోని పరీక్షా కేంద్రాల్లో 1894 మంది విద్యార్థులకు 1779 హాజరవ్వగా 115 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.



ఆచంటలో...

ఆచంట : మండలంలోని ఆచంట, కొడమంచిలి, వల్లూరు, ఆచంట వేమవరం జిల్లా పరిషత్ పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాల్లో మొదటి రోజు విద్యార్థులు తెలుగు పరీక్ష రాశారు. తెలుగు సబ్జెక్టు పరీక్షకు 573 మంది విద్యార్థులకు 532 హాజరవ్వగా 41 మంది గైర్హాజరైనట్లు ఎంఇఒ ఉషారాణి తెలిపారు.

కాళ్ల : మండలంలోనాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కోపల్లె పరీక్షా కేంద్రంలో 227 మంది విద్యార్థులకు 206 మంది హాజరవ్వగా 21 మంది గైర్హాజరయ్యారు. కాళ్ల పరీక్షా కేంద్రంలో 279 మందికి 263 మంది, ఏలూరుపాడు పరీక్షా కేంద్రంలో 192 మందికి 176 మంది, కలవపూడి పరీక్షా కేంద్రంలో 133 మంది విద్యార్థులకు 127 మంది హాజరయ్యాయరని ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు తెలిపారు. మండలంలో మొత్తం 831 మంది విద్యార్థులకు 772 మంది విద్యార్థులు హాజరవ్వగా 59 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేశారు.



ఉండిలో...

తాడేపల్లిగూడెం : మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తాడేపల్లిగూడెం ఎంఇఒ పిఎంకె.జ్యోతి తెలిపారు. పట్టణం, మండలం కలిపి 13 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 2656 మంది విద్యార్థులకు 2467 మంది హాజరయ్యారని, 187 మంది గైర్హాజరయ్యాయరని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. విద్యార్థులకు తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు.

ఉండి :ఉండి-ఎ, ఉండి-బి, ఎన్‌ఆర్‌పి అగ్రహారం, ఉప్పులూరు పరీక్షా కేంద్రాల్లో 658 మంది విద్యార్థులకు 594 మంది హాజరవ్వగా 64 మంది గైర్హాజరైనట్లు ఎంఇఒ బి.జ్యోతి తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయడమే కాకుండా విద్యార్థులు అస్వస్థతకు గురైతే చికిత్స అందించేందుకు ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది అందుబాటులోనే ఉన్నట్లు వారు తెలిపారు.

పాలకొల్లు : పాలకొల్లులో మొత్తం 12 కేంద్రాల్లో 2137 మంది విద్యార్థులు పరీక్ష పరీక్షలు రాయనున్నారు. వీరిలో 1128 మంది బాలురు, 1009 మంది బాలికలు పరీక్ష రాశారు. పట్టణంలో బిఆర్‌ఎంబి హైస్కూల్, ఎంఎంకె హైస్కూల్, మున్సిపల్ గర్ల్స్ స్కూల్లో 300 చొప్పున విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నామమాత్రంగానే ఉంది. ఇప్పటికే పోలీసులు ఎన్నికల బందోబస్తులో ఉన్నారు.

గణపవరం : మండలంలో ఏడు హైస్కూళ్లకు సంబంధించిన 852 మంది విద్యార్థులకు 785 మంది హాజరవ్వగా 67 మంది గైర్హాజరయ్యారని ఎంఇఒ శేషు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పెనుగొండ : మండలంలోని ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ సుధాకర్ తెలిపారు. సోమవారం నిర్వహించిన పరీక్షకు 1182 మంది విద్యార్థులకు 1015 మంది హాజరవ్వగా 167 మంది గైర్హజరయ్యారని తెలిపారు.

పాలకోడేరు : మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు 702 మంది విద్యార్థులకు 647 మంది హాజరవ్వగా 55 మంది గైర్హాజరయ్యారని ఎంఇఒ పివిఎస్.నాగరాజు తెలిపారు. పాలకోడేరులో 21 మంది, గొల్లలకోడేరులో పది మంది, శృంగవృక్షంలో ఏడుగురు, విస్సాకోడేరులో ఐదుగురు, మోగల్లులో 12 మంది చొప్పున పరీక్షలకు గైర్హాజరయ్యారని తెలిపారు.

విద్యార్థినికి అస్వస్థత

నరసాపురం : మండలంలోని ఎల్‌బి చర్ల గురుకుల పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థిని అస్వస్థతకు గురైంది. యర్రంశెట్టివారిపాలెం హైస్కూల్ విద్యార్థిని చింతా రుక్మిణికి ఆదివారం నీరసంగా ఉండి వాంతులు కావడంతో ఆర్‌ఎంపి డాక్టర్‌కి చూపించారు. సోమవారం ఎల్‌బి చర్ల గురుకుల పాఠశాలలో తెలుగు పరీక్ష రాస్తుండగా నీరసానికి గురై వాంతులు అయ్యాయి. దీంతో ఆరోగ్య సిబ్బంది ఆ విద్యార్థినికి మాత్రలు ఇచ్చారు. ఆ విద్యార్థిని ఆ నీరసంతోనే పరీక్షను పూర్తి చేసింది. అనంతరం అనంతరం తల్లిదండ్రులు ఆమెను 108 అంబులెన్స్‌లో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.




విద్యార్థినిని ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

పిహెచ్‌సిల్లో ఎన్నికల కోడ్ అమలు

డిఎంహెచ్‌ఒ డి.మహేశ్వరరావు

ప్రజాశక్తి - గణపవరం




మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ మహేశ్వరరావు

రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలోని పిహెచ్‌సి కేంద్రాల్లో ఎన్నికల కోడ్ అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డి.మహేశ్వరావు అధికారులను ఆదేశించారు. పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న వెంకటరాజపురంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్నిసోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిహెచ్‌సి కేంద్రాల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ కచ్చితంగా అమలు చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇ.సంతోష్‌నాయుడు, ఆరోగ్య సహాయకులు నామాల రాజు, ఎఎన్‌ఎం ఏసమ్మ, డిఇఒ వసంత, ఆశాలు భవాని దుర్గ, ఎంఎల్‌హెచ్‌పి మాధురి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా ఖజానా గణాంక అధికారి గణేష్‌కు వినతి

ప్రజాశక్తి - భీమవరం



ఖజానా అధికారిని సత్కరిస్తున్న వక్తలు

ఫ్యామిలీ పెన్షనర్స్ పుట్టిన తేదీ నమోదు చేయడంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు భీమవరం సబ్ ట్రెజరీ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా భీమవరం వచ్చిన జిల్లా ఖజానా గణాంక అధికారి ఎ.గణేష్‌ను భీమవరం యూనిట్ కార్యదర్శి పి.సీతారామరాజు, జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గాతల జేమ్స్, కార్యదర్శి సాగిరాజు సత్యనారయణరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎవి.భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.చాన్‌బాషా, సీనియర్ పెన్షనర్స్ బి.సత్యనారయణరాజు, చెరుకువాడ రంగసాయి, జివిఎస్.రాజు కలిసి పలు సమస్యలపై వినతులు అందించి సత్కరించారు. కొత్తగా మంజూరైన పిపిఒలో పాత జిల్లా కేంద్రమైన ఏలూరు డిటిఒ కార్యాలయం నుంచి భీమవరం ట్రెజరీకు రావాల్సి ఉందని, ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్ వచ్చే వరకు ఇదే విధంగా జరుగుతుందని తెలిపారు. టెక్నికల్ ఇబ్బందులు ఉన్నవి తప్ప వారికి వచ్చిన అందరి పిపిఒలను ఆయా సబ్ ట్రెజరీలకు వెంటనే పంపుతున్నామని చెప్పారు.



నరసాపురంలో పోలీసుల కవాతు

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలి

పలుచోట్ల పోలీసుల కవాతు

ప్రజాశక్తి - నరసాపురం

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని నరసాపురం డిఎస్‌పి జి.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని పీచుపాలెం నుంచి పట్టణ పోలీసులు, సిఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో లూథరన్ చర్చి వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసాపురం డిఎస్‌పి జి.శ్రీనివాసరావు, సిఐ కెవి.స్వామి మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో అల్లర్లు, కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా ప్రశాంత వాతావరణం కలిగిస్తున్నామన్నారు. టి.పాపారావు, ఎస్.చక్రధర్, అబ్బాస్ పాల్గొన్నారు.

ఉండి : ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఉండి ఎస్‌ఐ మందపల్లి లక్ష్మణ్ అన్నారు. ఉండి మెయిన్ సెంటర్ నుంచి కేంద్ర సాయుధ బలగాలతో సోమవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు లేకుండా ప్రతిఒక్కరూ ఓటు వేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలకు భరోసా కల్పించి ఓటు శాతాన్ని పెంచేందుకు, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్పించి అల్లర్లు సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, పోలీసులకు, అధికారులకు సహకరించాలని వారు సూచించారు.



సూర్యారావు పేటలో రొయ్యల చెరువును పరిశీలిస్తున్న ఇందిరా ప్రియదర్శిని

ఉప్పునీటి బోరు తవ్వకాలు నిలిపివేత

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కొలనపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సూర్యారావుపేటలో కె.లంకపానకేసు అనుకుని అక్రమంగా ఎటువంటి నిబంధనలను పాటించకుండా చెరువు తవ్వడం పలు విమర్శలకు దారి తీసింది. మొండికోడుకు చేర్చి అనధికారికంగా ఉప్పునీటి బోరు తవ్వకం పనులు చేపడుతున్నారని, అనుమతి లేకుండా బోర్లు వేస్తున్నారని కొలనపల్లి గ్రామ సూర్యారావు పేట వద రైతులు మత్స్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెడ్డి హనుమంతరావుకు చెందిన ఆర్ఎస్ నెంబర్ 407-4ఎ, 3ఎలో ఎకరం విస్తీర్ణంలో చెరువు ఉందని, పంటకాలువకు అనుకుని ఉప్పునీటి బోరు తవ్వడంలో నిబంధనలు పాటించలేదని తెలిపారు. రొయ్యల చెరువు, ఉప్పునీటి బోరు తవ్వకాలను మండల మత్స్యశాఖాధికారిని ఎం.ఇందిరా ప్రియదర్శిని సోమవారం పరిశీలించారు. ఆ రైతుకు వెంటనే నోటీసులు జారీ చేసి బోరు తవ్వకాలను నిలిపివేస్తామని ఆమె తెలిపారు. ఆమెతో పాటు సీసలి మత్స్యశాఖ గ్రామ అధికారి తిరుమాని సత్యనారాయణ, కొలనపల్లి గ్రామ విఆర్ఒ రాజేష్ ఉన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

ఆచంటలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి రాష్ట్ర యువజన కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షులు వైట్ల కిషోర్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా ఆచంట కమ్మ సంఘం కళ్యాణ మండపంలో కిమ్స్, మెడ్ యునైటెడ్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కంటి పరీక్షలు, గైనకాలజీ, దంత వైద్యాధికారులు 257 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కడలి రామ గోవిందరాజు, మనువర్తి విజయ్‌కుమార్, రెడ్డి రాంబాబు, మంగిన శ్రీను, ఉల్లం రామాంజనేయులు, తప్పెట్ల వెంకట్రావు, వైద్యాధికారులు మల్లిక, శైలజ, సూర్యకిరణ్, రఘురాం, జాయసన్, పవన్, దివ్య, గ్రేస్, వినీసా లిఖిత పాల్గొన్నారు.

బాధితులకు ఎంఎల్ఎ గ్రంధి పరామర్శ

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని పలువురు బాధితులను భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. తోలేరు మాజీ సర్పంచ్ భోగిరెడ్డి గోవిందరావు మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పరామర్శించారు. అలాగే పడమటిపాలెంలో కడలి శ్రీనివాస్ తండ్రి మరణించడంతో ఆయన కుటుంబాన్ని, వీరవాసరంలో రాంబాబు కుటుంబాన్ని ఎంఎల్ఎ పరామర్శించారు. ఆయనతో పాటు వైసిపి మండల కన్వీనర్ కడలి ధర్మారావు, జెడ్పిటిసి కన్వీనర్ మానుకొండ ప్రదీప్‌కుమార్, చవాకుల సత్యనారాయణ, నాగరాజు శ్రీనివాసరాజు, గొలగాని సత్యనారాయణ ఉన్నారు.

'టిడిపి కూటమితోనే అభివృద్ధి'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రాష్ట్రంలో మరో రెండు నెలల్లో అధికారంలోకి రానున్న టిడిపి, జనసేన, బిజెపి కూటమితోనే అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి కలుగుతుందని నిమ్మల సూర్యకుమారి అన్నారు. మన పాలకొల్లు మన రామానాయుడు ఇంటింటి ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని అరట్లకట్ట గ్రామంలో ఆమె టిడిపి, జనసేన శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఉమ్మడి అభ్యర్థి ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును గెలిపించాలని కోరారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం బిసిలకు 50 ఏళ్లకే పెన్షన్ అమలు చేస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధితోపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసే రామానాయుడును గెలిపించుకుంటేనే మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొత్తూరి కుమారస్వామిరాజు, చింతపల్లి సత్యనారాయణ, చింతపల్లి శ్రీనివాస్, పొత్తూరి విజయకుమార్‌రాజు, పొత్తూరి రఘుపతిరాజు, కడియం లక్ష్మీపతి, పోలిశెట్టి లక్ష్మీపతి, దాసరి చిట్టిబాబు పాల్గొన్నారు.

'ప్రజాగళం సభ విజయవంతం'

ప్రజాశక్తి - భీమవరం

చిలకలూరిపేటలో టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ప్రజాగళం సభ విజయవంతమైందని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజాగళం సభకు లక్షల్లో జనం వచ్చి తమ మద్దతు తెలిపారన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. జగన్ పాలన ఆర్థిక దుర్వినియోగం, అవినీతికి మారుపేరుగా మారిందన్నారు.

నేరాలు - ఘోరాలు

యువతిని మోసగించిన యువకుడికి జైలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.రెండు వేలు జరిమానా విధించారు. ఎఎస్ఐ మారిలింగం తెలిపిన వివరాల ప్రకారం... 2019లో యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన పాలకొల్లు నాగరాజుపేటకు చెందిన ఉప్పల నరేష్‌పై అప్పట్లో కేసు నమోదైంది. అప్పటి సిఐ సిహెచ్.ఆంజనేయులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు విచారణ జరిగిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏలూరు ఐదో అదనపు జిల్లా కోర్టు, మహిళా కోర్టు జడ్జి జి.రాజేశ్వరి నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.రెండు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో ఫిర్యాదుదారని తరపున ఎపిపి రామాంజనేయులు వాదనలు వినిపించారు. కేసులో సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్ష పడేందుకు సహకరించిన కోర్టు కానిస్టేబుల్ ఎస్.మురళిని, కె.మంగాదేవి అభినందించారు.

ఆగి ఉన్న కారులో నుంచి మంటలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని మాధవాయిపాలెం రేవు వద్ద ఆగి ఉన్న కారులో నుంచి మంటలు చెలరేగాయి. సోమవారం సాయంత్రం పంటి రేవు వద్ద కుటుంబసభ్యులతో ఆగి ఉన్న కారులో మంటలు చెలరేగాయి. దీంతో కారులో ఉన్న వారు కిందకి దిగిపోయారు. స్థానికులు వెంటనే స్పందించి మంటలను అదుపుచేశారు.

కాలువలో దూకి వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం

కాపాడిన యువకులు

నరసాపురం :కాలువలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలిని యువకుడు కాపాడారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మొగల్తూరు రోడ్డులోని చర్చి వద్ద మొగల్తూరు ప్రధాన కాలువలోకి ఓ వృద్ధురాలు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆ సమయంలో అటువైపుగా వెళ్తున్న యువకులు చూసి ఆమెను కాపాడారు. తన కుమారుడు తనను పట్టించుకోకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకునేందుకు దూకానని ఆమె తెలిపింది. తనది పట్టణంలోని పాత బజార్ అని చెప్పారు. సమాచారం అందుకున్న పట్టణ సిఐ కెవి.స్వామి, కానిస్టేబుల్ అబ్బాస్ స్పందించి ఆమెను ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పెనుగొండలో కుంటుపడిన అభివృద్ధి

పేరుకుపోయిన చెత్త
డ్రెయినేజీలు అస్తవ్యస్తం
పంచాయతీ కార్యదర్శి లేని వైనం
ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ మేజర్ పంచాయతీలో కార్యదర్శి లేరు. సుమారు మూడేళ్ల నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. ఎ గ్రేడ్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో గ్రామాభివృద్ధి కుంటుపడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని విమర్శిస్తున్నారు. ఇన్‌ఛార్జి కార్యదర్శులు విధులను నిర్వహిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ కార్యదర్శి విధులు నిర్వహిస్తారో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఒక కార్యదర్శి ఒక పని చేపట్టాక మరో కార్యదర్శి రావడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. కార్యదర్శి మారుతూ ఉండడంతో గతంలో ఏం జరిగిందో తమకు తెలియదని చెబుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో సమస్యలు అలాగే ఉండిపోతున్నాయని వాపోతున్నారు. మేజర్ పంచాయతీ కావడంతో ఇక్కడ విధులు నిర్వహించడం కష్టంగా మారిందని, కార్యదర్శి వచ్చిన కొంత కాలానికే ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారన్నారు. పంచాయతీ సర్పంచులకు, సభ్యులకు ఉన్న బేదాభిప్రాయాలు, ఒక పక్క నిలకడ లేని కార్యదర్శులతో అధిక ఆదాయం ఉన్న పంచాయతీలో ఆదాయాన్ని సమకూర్చుకోవడంలో ప్రజా ప్రతినిధులు విఫలమవుతున్నారని విమర్శిస్తున్నారు. గ్రామంలోని అన్ని వీధుల్లో చెత్త పేరుకుపోతుందని, డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉంటున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, దీంతో తాము రోగాల బారిన పడతామని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేయడానికి కార్యదర్శులు ఉండడంలేదన్నారు. సుమారు 32 వేల జనాభా ఉన్నారని, మున్సిపాలిటీ స్థాయిలో పంచాయతీ ఆదాయాలు ఉన్నా మున్సిపాలిటీ అవ్వకపోవడం దురదృష్టకరమని స్థానికులు అనుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెనుగొండ ఎ గ్రేడ్ కార్యదర్శిని నియమించాలని కోరుతున్నారు.



అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ



భూమిపై హక్కు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - గణపవరం


తమ నివాస భూములకు నిషేధం తొలగించి హక్కులు కల్పించాలని మండలంలోని పత్తేపురం గ్రామస్తులు గణపవరం సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈమేరకు గణపవరం సబ్ రిజిస్టర్ కార్యాలయం అధికారి బిహెచ్.లక్ష్మికి వినతిని అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ మాట్లాడుతూ బాధితలు 20 కుటుంబాలు 1955 నుంచి కొనుగోలు చేసిన నివాస భూములకు 2019 వరకు యథావిధిగా రిజిస్ట్రేషన్ జరిగాయన్నారు. 2020 నుంచి సబ్ రిజిస్టర్ కార్యాలయం వారు నిషేధిత భూములుగా 225/1, 225 /10 సర్వే నెం చేర్చి మా భూములపై మాకు హక్కులు లేకుండా చేశారని, మాకు అన్యాయం జరుగుతుందని బాధితులు ఆరోపించారన్నారు. కో కుటుంబానికి నాలుగు, ఐదు, ఆరు సెంట్లలో భూములు కొనుగోలు చేసి నివాసాలు ఉంటూ కరెంట్ బిల్లులు, ఇంటి పన్నులు, పంచాయతీలకు చెల్లించుతున్నారని తెలిపారు. వెంటనే ఆ భూములపై నిషేధం ఎత్తివేసి బాధితులకు భూములకు హక్కులు కల్పించాలని సబ్ రిజిస్టర్ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.వరలక్ష్మి, పొత్తూరు పద్మావతి, కుక్కల రాజేశ్వరి, రుద్రరాజు జానకి, వేగేషన్ సుబ్బలక్ష్మి, నడింపల్లి లక్ష్మి, వెలగలేటి మోహన పాల్గొన్నారు.



సబ్‌రిజిస్టర్ కార్యాలయం వద్ద గ్రామస్తులు

పంట పొలాలకు సాగునీరివ్వాలి

కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు



పొలాలు పరిశీలిస్తున్న రామాంజనేయులు

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని దేవ, తామరద గ్రామాల్లో పంట పొలాలకు సాగునీరివ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. పొట్ట దశలో ఉన్న పంటపొలాలకు సాగునీరు ఇవ్వడంలో అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవ, తామరాడ గ్రామాల్లో గత పది రోజులుగా వరిపొలాలకు సాగునీరు అందకపోవడంతో నెర్రలు తీశాయన్నారు. పొట్ట, ఈనిక దశలో నీరు అందకపోతే పంట దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని కౌలురైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. కాలువ నిండా తూడూ, డెక్కా, గడ్డి తీవ్రంగా పెరిపోవటంతో సాగునీరు వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. ఈ సమస్యను ఆయన ఇరిగేషన్ డిఇ సత్యనారాయణ, ఎఇ స్పందన దృష్టికి తీసుకెళ్లి మాట్లాడారు. అధికారులు మాట్లాడుతూ సమస్యను పరిశీలించి తక్షణమే సాగునీరందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కౌలు రైతులు చిలుకూరు శ్రీనివాస్, నెక్కంటి దొరయ్య, నెక్కంటి మోహన్, కేతారావు, చిలుకూరు చిన్న పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

డిఎస్‌పి వెంకటరెడ్డిని కోరిన మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పుష్పరాజ్

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని వాండ్రం లంక గ్రామంలో దళితుల శ్మశానవాటిక ఆక్రమించినవారిపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ డిఎస్‌పి వెంకటరెడ్డిని కోరారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్, భీమవరం డిఎస్‌పి వెంకటరెడ్డి వాండ్రం గ్రామంలో సోమవారం పర్యటించి పరిస్థితులను దళితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ విఆర్‌ఒ సైదాడ చిన్నారావు, కార్యదర్శి జడ్డు వెంకట తాతనాయుడు ఆక్రమణకు గురైన 77 సెంట్ల హద్దులు చూపిస్తామన్నారని చెప్పారు. కాని హద్దులు వేయడం కాదని, ఫెన్సింగ్ వేసి శ్మశానవాటికలో లైటింగ్ పెట్టాలని పుష్పరాజ్ డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఫెన్సింగ్ వేస్తామని, ప్రస్తుతం పెద్ద స్తంభాలతో హద్దులు వేసి ఇస్తామని పెద్దల సమక్షంలో గ్రామ విఆర్‌ఒ, పంచాయతీ కార్యదర్శి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నేతల సువర్ణరాజు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నన్నేటి నాగరాజు, జిల్లా ఉద్యోగ సంఘాల అధ్యక్షులు నేతల సాల్మన్‌రాజు, ఉండి నియోజకవర్గ అధ్యక్షులు చిగురపాటి రాజేష్, యువజన విభాగం అధ్యక్షులు మేడిది సాయి జగన్నాథ్, ఉండి మండలాధ్యక్షులు తోర్లపాటి భాగ్యరాజ్, ఆకివీడు మండలాధ్యక్షులు కేదాసి నాగరాజు, పెనుమంట్ర మండలాధ్యక్షులు కుసుమే వెంకటేశ్వరరావు, కేదాసి సూరిబాబు, మానుకొండ వెంకటరాజు, మాండ్రుమాక డేవిడ్ విల్సన్, ఇంటి సాల్మన్‌రాజు, కుప్పల రాజేష్, ఇంటి దానియేలు, ఇంటి సంతోష రావు, మాండ్రుమాక బెంజిమెన్ పాల్గొన్నారు.



వాండ్రంలో పర్యటిస్తున్న డిఎస్‌పి వెంకటరెడ్డి, పుష్పరాజ్

జెండా స్తూపాలకు రంగులు

ప్రజాశక్తి - ఉండి

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన జెండా స్తూపాలకు అధికారులు రంగులు వేయిస్తున్నారు. మండలంలోని పెదపుల్లేరు గ్రామంలోని జెండా దిమ్మెలకు నోడల్ అధికారి ఎం.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు రంగులు వేస్తున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సుమారు 70 రోజులు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, ఈ సమయంలో రాజకీయ పార్టీలకు చెందిన ఎటువంటి బ్యానర్లు గ్రామాల్లో పెట్టరాదని, ఎన్నికల కమిషనర్ ఆదేశాలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇటీవల మండల వ్యాప్తంగా ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆయిల్ స్టిక్కర్లను గోడలకు అంటించారని, అవి తొలగించడానికి సాధ్యపడడంలేదని నోడల్ అధికారి దృష్టికి స్థానిక అధికారులు తీసుకెళ్లారు. ఆ స్టిక్కర్ల స్థానంలో సిమెంట్ చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.రవీంద్ర, ఉండి గ్రామపంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణ, పెద్దపుల్లేరు గ్రామ రెవెన్యూ అధికారి దాసు, ఉండి ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల హక్కులు పరిరక్షించాలి

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని పండితవిల్లూరులో పోడూరు మండల ప్రధాన కార్యదర్శి సదమల్ల నరేష్ ఆధ్వర్యంలో మాల మహానాడు సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం దళితులకు కల్పించిన హక్కులను, నిధులను వంద శాతం ఖర్చు పెడతామని ఏ పార్టీ అయితే తమ మేనిఫెస్టోలో పెడుతుందో, ఆ పార్టీకి మాలమహానాడు అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు కర్ని జోగయ్య, జిల్లా అధ్యక్షులు గుండె నగేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు సరెళ్ల శ్రీనివాస్, పోడూరు మండల ఉపాధ్యక్షులు చికిలే సంపూర్ణరాజు, మండల యువజన ఉపాధ్యక్షులు సరెళ్ల రఘు, పోడూరు మండల కార్యదర్శి పాతగొలుసు సురేష్, పెనుగొండ మండల ఉపాధ్యక్షులు రొక్కాల విజయ్ గాంధీ, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి


ఎంపిడిఒ అనూహ్య

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అందరూ కృషి చేయాలని ఎంపిడిఒ అనూహ్య సూచించారు. పాలకోడేరు ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పెన్నాడ రమేష్ మాట్లాడుతూ వాలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనకూడదనే నిబంధన ఉన్నా వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ల ద్వారా ఎన్నికల ప్రచారం చేసే ప్రమాదం ఉందన్నారు. వెంటనే వీటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. అలాగే జగనన్న భూ రక్ష రాళ్లపై జగన్ ఫొటో ఉంటే వాటిని ఏ విధంగా కవర్ చేస్తారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి వారి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ నాగార్జున, ఇఒపిడిఆర్ ఆంజనేయులు, వైసిపి జెసిఎస్ కన్వీనర్ పాల రాధాకృష్ణ, టిడిపి మండలాధ్యక్షులు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, నాయకులు మల్లేశ్వరరావు, తోకల సాల్మన్‌రాజు, ఆశ్రియ్య, ఇంజేటి వెంకటేశ్వరరావు, తమ్మిశెట్టి చిన్నబ్బులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చేది కాంగ్రెసే

రాష్ట్ర అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య



ప్రజాశక్తి - కాళ్ల

ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వడంతో పాటు విభజన హామీలు నెరవేరుస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య అన్నారు. మండలంలోని కాళ్లకూరు గ్రామంలో గంగయ్య స్వగృహం వద్ద సోమవారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్మాణం, రాష్ట్ర రాజధాని, విభజన హామీలు అమలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏడు గ్యారెంటీ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న అధికార పార్టీ వైసిపి, ఎన్‌డిఎ కూటమిలో భాగస్వామ్య పక్షాలైన బిజెపి, తెలుగుదేశం, జనసేన పార్టీలకు ఓటు వేస్తే ప్రజలకు భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధి ఉండదన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని మార్చే సమయం ప్రజలకు వచ్చిందని, ఈసారి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పిసిసి సభ్యులు అంకెం సీతారాం, జిల్లా యూత్ అధ్యక్షులు సోము నాగ కేశవబాబు, జిల్లా కార్యదర్శి కొండా రాజేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు చింతా ఆదిశేషు, జిల్లా యూత్ ఉపాధ్యక్షులు సోము అప్పలరాజు, ఉండి నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షులు బోరాడ గౌరీనాయుడు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

వైసిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి గుడాల గోపీ

ప్రజాశక్తి - యలమంచిలి

తనను ఎంఎల్ఎగా గెలిపిస్తే పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని వైసిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి గుడాల గోపీ అన్నారు. మండలంలోని కంచుస్తంభంపాలెం గ్రామంలో నరసాపురం పార్లమెంటు అభ్యర్థి గూడూరి ఉమాబాలతో కలిసి ఆయన సోమవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్లుగా చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ మళ్లీ తిరిగి కొనసాగాలంటే వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల కల్లబొల్లి మాటలకు ఎవరూ మోసపోవద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గున్నం నాగబాబు, యడ్ల తాతాజీ, మద్దా చంద్రకళ, వైసిపి యువజన నాయకులు స్టాలిన్, కళ్యాణం గంగాధర్, లంక చిరంజీవి పాల్గొన్నారు.

'అధికారం కోసమే బండారు తాపత్రయం'

ప్రజాశక్తి - నరసాపురం

అధికారం కోసమే మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు తాపత్రయమని టిడిపి సీనియర్ నాయకులు భూపతి నరేష్, గుబ్బల నాగరాజు, సంధి నరసింహరావు, సంకరపు వెంకటేశ్వరరావు, జోగి పండు, గుత్తుల రాధాకృష్ణ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పొత్తూరి రామరాజు క్రమశిక్షణగా వ్యవహరిస్తూ అందరిని సమన్వయం చేసుకుంటున్నారన్నారు. అటువంటి వ్యక్తిని టిడిపి నాయకులు అని చెప్పుకునే కొంతమంది వ్యక్తులు విమర్శించడం విడ్డురంగా ఉందన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఎంపీ అభ్యర్థి గోకరాజు గంగరాజు డబ్బులతోనే మాధవనాయుడు ఎంఎల్ఎ అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొల్లు పెద్దిరాజ, జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడి రవి, వాతాడి ఉమా, అధికారి అనంత రామారావు పాల్గొన్నారు.

'టిడిపి కూటమికి అధికారం కోసం కృషి చేయండి'

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి కూటమి అధికారం కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో టిడిపి సమీక్ష సమావేశాన్ని భీమవరం మండలాధ్యక్షుడు రేవు వెంకన్న అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మాట్లాడుతూ భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి అంజిబాబు విజయానికి అందరూ కృషి చేయాలన్నారు. అంజిబాబు మాట్లాడుతూ భీమవరం ఎంఎల్ఎగా గతంలో పదేళ్ల పాటు ప్రతి గ్రామంలో 70 శాతం అభివృద్ధి చేశానని, తనకు మరోసారి ఎంఎల్ఎగా అవకాశం కల్పిస్తే నూరు శాతం పనులతో నియోజకవర్గాన్ని శరవేగంతో అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు), టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, భీమవరం మండలాధ్యక్ష కార్యదర్శులు రేవు వెంకన్న, కౌరు పృధ్వీశంకర్, టిడిపి జిల్లా కార్యదర్శి నాగిడి తాతాజీ పాల్గొన్నారు.

ఉండి : వచ్చే ఎన్నికల్లో ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి మంతెన రామరాజుకు 50 వేల ఓట్ల మెజార్టీ లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు అన్నారు. ఉండిలోని టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్యక్షులు కరిమెరక నాగరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో పొత్తూరి వెంకటేశ్వరరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్ మాట్లాడారు. టిడిపి కంచుకోట ఉండి నియోజకవర్గమన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతిఒక్కరికీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించాల్సిన బాధ్యత పార్టీ గ్రామ నాయకులపై ఉందన్నారు. గ్రామాల్లోని నాయకులందరూ ఏకతాటిపైకి రావాలని ప్రతిఒక్కరూ నిస్వార్థంగా మంతెన రామరాజు విజయానికి కృషి చేయాలని వారు సూచించారు. పార్టీ అధికారంలోకొస్తే ఇప్పటికంటే అధికంగా సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శేరేపాలెంలో 'జనంలోకి జనసేన'

ప్రజాశక్తి - మొగల్తూరు రూరల్

రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని శేరేపాలెంలో సోమవారం జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి జనసేన పార్టీ సిద్ధాంతాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీని ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జక్కం బాబ్జి, వలవల నాని, కొల్లాటి గోపీకృష్ణ, ఆకన చంద్రశేఖర్, బందెల రవీంద్ర, గుబ్బల మార్రాజు, నిప్పులేటి తారకరామారావు, కొత్తపల్లి రాంబాబు, అందే దొరబాబు, లక్కు బాబి, తిరుమాని ఏడుకొండలు, తోట నాని, దేసినీడి గంగాధర్, గ్రంధి నాని, గన్నాబత్తుల ప్రసాద్, ఒడుగు ఏసుబాబు, గజ్జరపు మురళి, పోలిశెట్టి నళిని, బెల్లంకొండ నాయుడు, ఇంటి మురళి, కూనపరెడ్డి రామకృష్ణ, కత్తుల చిట్టిబాబు, కత్తుల శ్రీను, కొండేటి తాతాజీ, దూసనపూడి అంజి పాల్గొన్నారు.

జనసేనలోకి చేరిక

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై మండలంలోని చామకూరిపాలెం గ్రామానికి చెందిన యువకులు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో వైసిపి నుంచి జనసేనలో చేశారు. వారందరికీ నాయకర్ పార్టీ కండువా కప్పి సాదారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వర్ధనపు ప్రసాద్, వలవల నాని, ఆకన చంద్రశేఖర్, బందెల రవీంద్ర, వాతాడి కనకరాజు, వట్టిప్రోలు సతీష్, కొట్టు రామాంజనేయులు, అయితం చిన్ని పాల్గొన్నారు.